బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సన్మానాలు

మాజీ ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జడ్పీ మాజీ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

బోనకల్లు, ఆగస్టు 11: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలోని ఎంపీటీసీలను, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావును బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా లింగాల కమల్‌రాజు, కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామని, పల్లెలను మరింత అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఇంతటి అవకాశాన్ని కల్పించిన బీఆర్ఎస్ కేసీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ బాణోతు కొండ, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జంగా రవి, నాయకులు పారా ప్రసాద్, వేమూరి ప్రసాద్, ఇటుకల శ్రీనివాసరావు, కంచర్ల బాబు, గద్దల వెంకటేశ్వర్లు, తన్నీరు పుల్లారావు, కొనకంచి నాగరాజు, యువత అధ్యక్షుడు షేక్ నజీర్, బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్‌లు రవి, నరహోత్తంరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

కొణిజర్ల, ఆగస్టు 11: మండల పరిధిలోని తీగలబంజర గ్రామానికి చెందిన ధరావత్ బోడియా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న డాక్టర్ కుంచపు రాంబాబు ఆదివారం వారి సోదరుడు రమేష్ ద్వారా మృతుడి కుటుంబసభ్యులకు రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. తీగలబంజర గ్రామం తరపున డాక్టర్ కుంచపు రాంబాబుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మీటునాయక్, నాగుల్‌మీరా, ఎ.కే.గన్నుబాయ్, వీ.రాంబాబు, భూక్యా శ్రీను, దాదా సాహేబ్, వీ.లాలు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

పెనుబల్లి, ఆగస్టు 11: లయన్స్ క్లబ్ ఆఫ్ సప్తగిరి వీఎం.బంజర వారి ఆధ్వర్యంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న పెనుబల్లి బీసీ కాలనీకి చెందిన రిక్షా కార్మికుడు మోదీన్ కుమారుడు లతీఫ్ కుటుంబ సభ్యులకు రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. మిట్టపల్లి జనార్ధన్, ఎస్‌కే.అబ్దుల్‌సలాం, శ్రీధరాల సుబ్బారావు, మిట్టపల్లి శ్రీధర్, కారుమంచి ఆనంద్, నాళ్ల జయరాం, పెరుమాళ్ల రామారావు, దీవెల మంగపతిరావు, చెన్ను కిశోర్, పోట్రు వెంకటేశ్వరరావు, సుంకర సత్యనారాయణ, బజ్జూరి నాగేశ్వరరావు, బెజవాడ మల్లికార్జునరావు, నేరేటి బాబురావు, శీలం మాధవరెడ్డి, నాళ్ల నాగేశ్వరరావు, బోడా చెన్నారావు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుగా జాతీయ రహదారి

జాతీయ రహదారిపై పేరుకుపోయిన చెత్త

పెనుబల్లి, ఆగస్టు 11: జాతీయ రహదారిపై చెత్తచెదారం వేయడంతో డంపింగ్ యార్డును తలపిస్తుంది. ఇటీవల వర్షాలు ఎక్కువగా ఉండడం, విషజ్వరాలు బారిన పడడం, ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నప్పటికీ పంచాయతీ అధికారులు కనీసం చెత్తను తొలగించే ప్రయత్నం చేయడం లేదు. వీ.ఎం.బంజర నుంచి తిరువూరు రోడ్డు సమీపాన కుప్పలు కుప్పలుగా చెత్తను పడవేయడంతో డంపింగ్‌ను తలపిస్తోంది. ఇప్పటికైనా డంపింగ్‌యార్డును తలపించే ఈ చెత్తను తొలగించి ప్రజలు విషజ్వరాల భారిన పడకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ముఖ్య కార్యకర్తల సమావేశం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరాటౌన్, ఆగస్టు 11: ఈ నెల15న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఉన్న నేపథ్యంలో వైరా మున్సిపాలిటీ, వైరా మండల పరిధిలో ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించారు. సీఎం సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పిలుపునిచ్చారు.

ఆటో మొబైల్ షాపు ప్రారంభం

పట్టణంలోని వెంకటేశ్వర ఆటోమొబైల్ షాపును ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డ్వాక్రా మహిళలు, ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందాలని, ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందని తెలిపారు.

క్రమశిక్షణ, నాణ్యమైన విద్యతోనే ప్రగతి

సొంత ఖర్చులతో 604 మందికి సైకిళ్లు

పాలేరులో విద్య అగ్రగామిగా ఉండాలి

మత్తుపదార్థాలపై ఉక్కుపాదం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి, ఆగస్టు 11 : ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తే ప్రగతి సాధ్యం అవుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీలు ప్రిన్సిపాల్స్, హెచ్ ఎంలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 604మంది బాలికలలు సొంత ఖర్చులతో సైకిళ్లను కొనిస్తానని తెలిపారు. అలాగే మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలని, ఎంతటి వారైనా ఉపేక్షిచకుండా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్రంలో అమ్మ ఆదర్శ పాఠశాలకు రూ.657 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారితోపాటూ మండల అధికారులతో కలిసి సమీక్షించామన్నారు.

పాలేరు మోడల్‌గా ఉండాలి..

పాలేరు నియోజకవర్గం ఎడ్యుకేషన్ హబ్‌గా ఉండాలని, అందుకు తన వంతుతోపాటు, ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో విద్యలో అగ్రగామిగా ఉంచుతామన్నారు. హెచ్ఎంలు, ప్రిన్సిపాల్స్‌తో కలిసి మాట్లాడిన విషయాల్లో పాఠశాలలో అవసరం అయిన చోట్ల ప్రభుత్వం ద్వారా వచ్చేంత వరకు ఖర్చు చేసి సొంతంగా కార్యాచరణ తీసుకుంటామన్నారు. హెచ్ఎంలు సమయపాలనతోపాటూ బాధ్యతాయుతంగా పనిచేసి మంచి ఫలితాలు వచ్చే విధంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో డీఈవో సోమశేఖరశర్మ, ఆర్డీవో గణేశ్, ఏసీపీ తిరుపతి రెడ్డి, పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల హెచ్ఎంలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహిస్తాం..

ఖమ్మం, ఆగస్టు 11: కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తుందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం మూడోరోజు ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలను ఇంత అద్భుతమైన స్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లడం చాలా అభినందనీయమన్నారు. ఏడు సంవత్సరాలుగా ఇటువంటి కార్యక్రమాన్ని భుజాన వేసుకుని నడిపిస్తున్న అన్నా బత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ సుబ్రహ్మణ్యకుమార్, ఖమ్మం కళాపరిషత్ ప్రజానాట్య మండలి సంస్థలను అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ నాగబత్తిని రవి, అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు, డాక్టర్ వేల్పుల విజేత, కురువెల్ల ప్రవీణ్, సదానందం, కర్నాటి కృష్ణ, దయాకర్‌రెడ్డి, బొమ్మ రాజేశ్వరరావు, దేవేంద్ర, పుష్పరాణి, మొగిలి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా 'ముత్యాలమ్మ' జాతర

చింతకాని : నాగులవంచలో బోనాలు

రఘునాథపాలెం, ఆగస్టు 11 : ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలాల్లో శ్రావణమాసం బోనాల జాతర మొదలైంది. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ముత్యాలమ్మ జాతర పండుగ వాతావరణం నెలకొన్నది. ఇంటింటికీ మామిడి తోరణాలను కట్టుకొని ఇళ్లను అందంగా అలంకరించుకున్నారు. గ్రామాల్లో ప్రజలంతా కలిసి ఒకేసారి ముత్యాలమ్మ పండుగను జరుపుకోవడంతో సందడి కనిపించింది. ఈ సందర్భంగా మహిళలు ఉదయాన్నే ఇళ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అంతేకాక ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక నైవేద్యాన్ని వండి బోనం తయారుచేసి తలపై పెట్టుకొని డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా బయలెల్లారు. ముందుగా గ్రామాల్లోని బొడ్రాయికి నీళ్లు పోసి పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనాలతో ఊరేగింపుగా బయలెల్లి ముత్యాలమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పాండురంగాపురంలో రజకులతో తొలిగా ముత్యాలమ్మ జాతర ప్రారంభమైంది. రజక సంఘం జిల్లా నేత తంగెళ్లపల్లి శ్రీనివాస్, కొండల్, రామారావు, దేవరకొండ నాగేశ్వరరావు, రవి, శ్రీనివాస్, నవీన్, నర్సింహారావు పాల్గొన్నారు.

ఖమ్మం, ఆగస్టు 11 : శ్రావణమాసం సందర్భంగా ఖమ్మం నగరంలోని అనేక ప్రాంతాల్లో ఆదివారం పెద్దఎత్తున మహిళలు బోనమెత్తారు. కుటుంబ సభ్యులందరూ సంప్రదాయ పద్ధతిలో అమ్మవారికి బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. 46వ డివిజన్‌లో రజక కుటుంబాలు నిర్వహించిన బోనాలు పండుగలో కార్పొరేటర్ కన్నం వైష్ణవి పాల్గొని బోనమెత్తారు. ముత్యాలమ్మ తల్లి దయతో అంటువ్యాధులు ప్రబలకుండా అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వారు కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో పగిళ్ళ బుచ్చిబాబు, సీతారాములు, తంగెళ్ల శీను, జల్లేపల్లి సులోచన తదితరులు పాల్గొన్నారు

చింతకాని, ఆగస్టు 11 : మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో ఆదివారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గ్రామదేవతలకు ఆదివారం బోనాలు సమర్పించారు. కుటుంబ సమేతంగా గ్రామదేవతలైన ముత్యాలమ్మ, బుర్జుబైసమ్మ, బోడ్రాయికి నైవేద్యం, పొంగళ్లను సమర్పించారు. వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని దేవతలకు మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో వంకాయల పాటి సత్యనారాయణ, కోల్లి బాబు, వంకాయలపాటి వెంకటలచ్చయ్య, అంబటి వెంకటి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ బోనాల పండుగ షురూ

ఖమ్మం రూరల్, ఆగస్టు 11 : మండలంలో శ్రావణమాసం ముత్యాలమ్మ బోనాల పండుగ వేడుకలు ప్రారంభం అయ్యాయి. అసలేరు కార్తె, శ్రావణమాసం నెలలో జిల్లాలో పెద్దఎత్తున ముత్యాలమ్మ బోనాలు జరుపుకోవడం అనవాయితీగా వస్తుంది. శ్రావణమాసం తొలిరోజున రజక సోదరులతో పాటు, శాలీవాహనులు సైతం బోనాలు సమర్పిస్తారు. మరుసటి వారాలలో మిగిలిన అన్ని కులాల వాళ్లు ముత్యాలమ్మ బోనాలు చెల్లిస్తారు. అందులో భాగంగా ఆదివారం మండల కేంద్రంతోపాటు, ఖమ్మం నగరంలో బోనాల వేడుక ప్రారంభమైంది. ఉదయం నుంచి ఎంతో నిష్టతో నైవేద్యం తయారు చేసిన మహిళలు మధ్యాహ్నం తరువాత నుంచి ఆయా గ్రామాలలోని ముత్యాలమ్మ గుడి వద్దకు చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

జర్నలిస్టుల సంక్షేమ నిధికి రూ.5 లక్షలు

రూ.5 లక్షలు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లిటౌన్, ఆగస్టు 11: జర్నలిస్టులకు రూ.25 లక్షలు సంక్షేమ నిధికి ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన నేపథ్యంలో తొలివిడతగా రూ.5 లక్షలు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.5 లక్షలను డిపాజిట్ చేసి వచ్చిన వడ్డీతో జర్నలిస్టులకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని, మిగిలిన రూ.20 లక్షలను ప్రతి ఏటా రూ.5 లక్షల చొప్పున జమ చేస్తామని తెలిపారు. అనంతరం కళాకారుల సంక్షేమ నిధికి రూ.2 లక్షలు అందించారు. ఆరుగురు దివ్యాంగులకు రూ.60 వేలతో ట్రై సైకిళ్లు అందించారు. ఎన్టీఆర్ నగర్ క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో పేద మహిళలకు, పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందించారు. ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, నీరజాదేవి, చల్లగుళ్ల నరసింహారావు, గాదె చెన్నారావు, తోట సుజలరాణి, ఎం.డీ.కమల్‌పాషా, శివవేణు, దూదిపాల రాంబాబు, నారాయణవరపు శ్రీనివాసరావు, అలవాల కరుణాకర్, చల్లారి వెంకటేశ్వరరావు, ఉడతనేని అప్పారావు, పింగళి సామేలు, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలకు మద్దతు ధర ఇవ్వాలి

వైరాటౌన్, ఆగస్టు 11: పామాయిల్ గెలల టన్నుకు రూ.20 వేలు మద్దతు ధర ఇవ్వాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, పామాయిల్ సాగు రైతులు సంఘం రాష్ట్ర నాయకులు తుంబూరు మహేశ్వరరెడ్డి, కొక్కెర పాటి పుల్లయ్య డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో రైతు సంఘం బృందం ఆదివారం పామాయిల్ తోటను పరిశీలించి సాగు రైతులు సమస్యలపై కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పామాయిల్ టన్నుకు రూ.20వేలు నిర్ణయం చేయాలని కోరారు.

తిరుమలాయపాలెంలో భారీ వర్షం

భారీ వర్షానికి మండలంలోని తిరుమలాయపాలెం ప్రాంతంలో పత్తి చేలల్లో నిలిచిన నీరు

భారీ వర్షానికి మత్తడిపోస్తున్న కొక్కిరేణి నల్లతోపుల చెరువు

తిరుమలాయపాలెం, ఆగస్టు 11 : మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో కొక్కిరేణి నల్లతోపుల చెరువు, దమ్మాయిగూడెం ఊరచెరువు, మేడిదపల్లి రావికుండ, బచ్చోడు కొత్తకుంట, హస్నాబాద్ ముత్యాలమ్మ కుంట మత్తడిపోశాయి. మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులకు 80శాతం మేర నీరు చేరింది. భారీ వర్షంతో పంట పొలాల్లో నీరు నిలిచింది. చెరువుల్లోకి నీరు చేరడంతో వరి సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు.

నేడు మండలంలో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం రూరల్, ఆగస్టు 11 : మండలంలో సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటిస్తారని మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు మండలంలోని ఆరెంపుల, ఆరెకోడు గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. 11గంటలకు తల్లంపాడు నుంచి పైనంపల్లి వరకు రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థపన చేస్తారు. అనంతరం 11.30 నుంచి బైపాస్ రోడ్‌లోని టీసీవీ ఫంక్షన్‌హాల్‌లో పాలేరు నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి, సంక్షేమం, వ్యవసాయం, పారిశుధ్యం తదితర అంశాలపై అధికారులతో సమీక్ష చేస్తారని దయాకర్‌రెడ్డి తెలిపారు.

వృద్ధులకు మధ్యాహ్న భోజనం

వైరాటౌన్, ఆగస్టు 11: వైరా మండలం గన్నవరంలో బహుజన అభ్యుదయ సేవా సమితి ఆశ్రమంలో వృద్ధులకు ఆదివారం మధ్యాహ్న భోజనాన్ని అందించారు. వృద్ధులకు ప్రతి వారం మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు ఆదూరి మణి తెలిపారు. అనంతరం సంస్థ వ్యవస్థాపకులు ఆదూరి ఆనందం మాట్లాడుతూ.. సహాయం చేయాలనే ఆసక్తి కలిగిన దాతలు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి తలమానికంగా ఖమ్మం అభివృద్ధి
వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

ఖమ్మం, ఆగస్టు 11: అభివృద్ధిలో ఖమ్మంజిల్లాను రాష్ట్రానికే తలమానికంగా నిలుపుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర టూరిజంశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఖమ్మం పర్యటన నేపథ్యంలో మంత్రి తుమ్మల పలు అభివృద్ధి పనులను చేపట్టేలా ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఖమ్మంజిల్లా అభివృద్ధిని పరుగులు తీసేలా కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. ఖమ్మం నడిబొడ్డున ఉన్న ఖిల్లా 4 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉందన్నారు. 900 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ కోట పురాతన వైభవాన్ని సంతరించేలా కోట్లాది రూపాయల నిధులతో అన్ని హంగులతో పునర్నిర్మాణం చేపడతామన్నారు. ఎంతో చారిత్రకమైన కోటకు చాలా విశిష్టత ఉందన్నారు. గోడలను గ్రానైట్, సున్నపు గారెలతో నిర్మించారని చారిత్రక కట్టడాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఖిల్లా సంపదను భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం అభివృద్ధి చర్యలు చేపడుతుందన్నారు.

వైద్యంపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు: సీపీఎం

ఖమ్మం, ఆగస్టు 11: వైద్యంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, ఫలితంగా జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్‌తో కలిసి ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత ఖమ్మం జిల్లాలోనే అత్యధిక డెంగీ కేసులు నమోదవుతున్నాయని, హైరిస్క్ జోన్‌గా ప్రకటించినా ప్రభుత్వం ఆ స్థాయిలో ఇక్కడ వైద్యసేవలు అందించడం లేదని మండిపడ్డారు.

రైతుకు ఆర్థిక సాయం

రఘునాథపాలెం, ఆగస్టు 11 : గుర్తు తెలియని వ్యక్తులు కలుపుమందు పిచికారీ చేయడంతో మిరపనారు నష్టపోయిన బాధిత రైతుకు సాయం చేసేందుకు గ్రామస్తులు ముందుకొచ్చారు. తుమ్మలపల్లి నర్సింహారావు, చోటేబాబా నారు కొనుగోలు కోసం సాయం అందించారు. బాధిత రైతు చంద్రం వారికి కృతజ్ఞతలు తెలిపారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

మధిర, ఆగస్టు 11: మధిర పట్టణంలోని వైరారోడ్డులో నివాసం ఉంటున్న బెజ్జం చైతన్య తనను భర్త, అత్తమామలు వరకట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారని శనివారం రాత్రి ఫిర్యాదు చేయడంతో వేధింపుల కేసు నమోదైంది. బెజ్జం చైతన్యకు పెనుగంచిప్రోలు మండలం నవాబుపేటకు చెందిన గోరంట్ల గాంధీతో 2015లో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. పెళ్లయిన కొంతకాలానికి తన భర్త మద్యానికి బానిసయ్యాడు. తనను నిత్యం అనుమానిస్తూ అదనపు కట్నం తీసుకురావాలని అత్తమామలు, భర్త వేధిస్తున్నారని ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై సంధ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్సైకి గాయాలు

ఖమ్మం రూరల్, ఆగస్టు 11: రోడ్డు ప్రమాదంలో ఓ సబ్ ఇన్‌స్పెక్టర్‌కు గాయాలైన ఘటన ఖమ్మం రూరల్ మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లాలోని సీరోలు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన విజయ్‌రాంకుమార్ ఇటీవల సీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కాగా, ఆదివారం రాత్రి విజయ్‌రాంకుమార్ ఖమ్మం వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఖమ్మం రూరల్ మండలంలోని కాచిరాజుగూడెం సమీపంలో మూలమలుపు వద్ద అతడి వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. స్థానికులు హుటాహుటిన ఖమ్మంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అతడి తలకు గాయాలైనప్పటికీ క్షేమంగానే ఉన్నట్లు సమాచారం.

నిరుపేదలకు చీరెలు పంపిణీ

మధిర, ఆగస్టు 11: మధిర సేవాసమితి ఆధ్వర్యంలో పల్లపోతు ప్రసాదరావు అధ్యక్షతన దాచేపల్లి రాము కుమారుడు, కోడలు హేమంత్‌మణికంఠ, చంద్రకళ వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా నిరు పేదలకు ఆదివారం చీరెలను పంపిణీ చేశారు. ఇరుకుళ్ల లక్ష్మీనరసింహా, దాచేపల్లి ముత్యాలు, కోమటిడి శ్రీనివాసరావు, యర్రా లక్ష్మణరావు, మువ్వా రామకృష్ణ, షేక్ జహంగీర్, చలువాది చిన్నకృష్ణమూర్తి, మహంకాళి శ్రీనివాసరావు, నంబూరి మురళీ, చల్లా సత్యనారాయణ, కోనా సుబ్బారావు, దొడ్డా శ్రీనివాసరావు, వేముల నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

పేకాడుతున్న 8మంది అరెస్ట్

రఘునాథపాలెం ,ఆగస్టు 11: ఊరిబయట పేకాట ఆడుతున్న 8మందిని రఘునాథపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈర్లపూడి గ్రామానికి చెందిన వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు సీఐ హుస్సేన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1700 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వాటర్ హీటర్ తాకి వ్యక్తి మృతి

మామిళ్లగూడెం, ఆగస్టు 11: నీళ్లు వేడి చేసే క్రమంలో వాటర్ హీటర్ తాకి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఖమ్మం నగరంలో ఆదివారం చోటుచేసుకుంది. త్రీటౌన్ సీఐ రమేశ్ కథనం ప్రకారం.. ఖమ్మం కాల్వొడ్డు హనుమాన్ గుడి ప్రాంతానికి చెందిన దోనెపూడి మహేశ్‌బాబు (40) కొబ్బరికాయల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. అయితే ఆదివారం నీటిని వేడి చేసేందుకు వాటర్ హీటర్ పెట్టే క్రమంలో అతడు విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. ఆ సమయంలో అక్కడే నిలబడి ఉన్న అతడి తొమ్మిదేళ్ల కుమార్తె శభన్య.. అతడు పడిపోవడాన్ని గమనించి భయంతో కేకలు వేస్తూ పరుగెత్తింది. దీంతో అప్రమత్తమైన భార్య, స్థానికులు వచ్చి వాటర్ హీటర్ స్విచ్ ఆఫ్ చేశారు. అతడిని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతడి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపర్చారు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య దుర్గాదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తోటకూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్‌ప్లాంట్

కారేపల్లి, ఆగస్టు 11: తోటకూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేకలతండాలో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తోటకూరి పిచ్చయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గేటుకారేపల్లి, కారేపల్లి, రేగులగూడెం, మేకలతండా గ్రామాల్లో సుమారు రూ.22లక్షల వ్యయంతో ప్లాంట్లను ఏర్పాటు చేశామని, గ్రామస్తులకు ఉచితంగా క్యాన్లు కూడా పంపిణీ చేశామన్నారు. మత్రు, గుగులోత్ బాలాజీ, ఆంగోత్ నరేష్, శ్రీరామ్, శంకర్, లచ్చిరాం, సామేలు, కోటేష్, సక్రాం, బావ్‌సింగ్, సాములు పాల్గొన్నారు.

ఉచితంగా నీళ్ల క్యాన్‌లు అందజేస్తున్న పిచ్చయ్య

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

వేలం కోసం బహిరంగ ప్రకటన
తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటి నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ